సాక్షి
నిజామాబాద్

సోమవారం । 14 । అక్టోబర్ । 2024



బెల్ట్ షాపులకు టెండర్లు

గ్రామాల్లో బెల్ట్ షాపుల నిర్వహణకు గ్రామాభివృద్ధి కమిటీల ఆధ్వర్యంలో టెండర్లు నిర్వహిస్తున్నారు.

- 8లో ▸



రైతు సంక్షేమమే ధ్యేయం

రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి అన్నారు.

- 9లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
37.2 /21.6

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

హైందవ మతం గొప్పది



బోధన్ టౌన్: ప్రకృతితో పాటు, గోవును దైవంగా పూజించే హైందవ మతం ఎంతో గొప్పదని ఆర్‌ఎస్‌ఎస్ విభాగ్ ప్రచారక్ దిగంబర్‌రావు అన్నారు. విజయ దశమి ఉత్సవాలను పురస్కరించుకొని శనివారం రాత్రి పట్టణంలోని శక్కర్‌నగర్ రాంలీలా మైదానంలో రావణ దహనం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. పాశ్చాత్య సంస్కృతికి యువత ఆకర్షితులై హిందు మతాచారాలను మరిచిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం రావణ దహనం నిర్వహించారు. ఉషోదయ విద్యాసంస్థల డైరెక్టర్ దుష్యంత్, ఏసీపీ శ్రీనివాస్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రేకం దాసు, శేఖర్, రవీందర్ యాదవ్, పెర్క స్వామి, ఇండ్ల సూర్యకుమార్, బొందుగుల శ్రీనివాస్, కిరణ్ పాల్గొన్నారు.

రేషన్ డీలర్ అభ్యర్థులకు ఇంటర్వ్యూ

బోధన్: బోధన్ రెవెన్యూ డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న రేషన్ డీలర్ల నియామకం కోసం సెప్టెంబర్ 26న రాత పరీక్షను నిర్వహించారు. ఈ పరీక్షలో ప్రతి రేషన్ దుకాణం పరిధిలో మొదటి ఐదు స్థానాలలో నిలిచిన అభ్యర్థులకు ఈ నెల 15 నుంచి 17 వరకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు సబ్ కలెక్టర్ వికాస్ మహతో ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు తన ఆఫీసులో ఇంటర్వ్యూలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. వివరాల కోసం తన కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

దసరా వేడుకల్లో దిల్ రాజు



మోపాల్: మండలంలోని నర్సింగ్‌పల్లి ఇందూరు తిరుమల గోవింద వనమాల క్షేత్రంలో శనివారం జరిగిన దసరా వేడుకలకు సినీ నిర్మాతలు దిల్ రాజు, శిరీష్, సినీ హీరో ఆశిష్ హాజరయ్యారు. వేద పండితుల మధ్య శమి (జమ్మి) వృక్షానికి పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకీ సేవ నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు నర్సింహారెడ్డి, విజయసింహారెడ్డి, బలగం సినీ నిర్మాత హర్షిత్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రతి పనిలో విజయం సాధించాలి



కామారెడ్డి క్రైం: ప్రతి పనిలో అధికారులు, సిబ్బంది విజయం సాధించాలని, ప్రజలకు మరింత మెరుగైన సేవలందించాలని ఎస్పీ సింధుశర్మ అన్నారు. జిల్లా సాయుధ దళాల కార్యాలయంలో శనివారం ఆయుధ, వాహన పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. శాంతిభద్రల పరిరక్షణ, నేరాల నియంత్రణలో జిల్లా పోలీసుశాఖ ముందంజలో ఉండాలన్నారు. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా విజయదశమిని జరుపుకుంటున్నామన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ అధికారులు, సిబ్బందికి దసరా శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) కే నరసింహారెడ్డి, కామారెడ్డి డీఎస్పీ నాగేశ్వరరావు, ఏఆర్ డీఎస్పీ యాకుబ్‌రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ జార్జ్, కామారెడ్డి టౌన్ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

విండోలకు పర్సన్ ఇన్‌చార్జీల నియామకం

భిక్కనూరు: మండలంలోని కాచాపూర్, బస్వాపూర్ సింగిల్‌విండోలకు పర్సన్ ఇన్‌చార్జీలను నియమించారు. బస్వాపూర్ సింగిల్ విండోను విభజించి కాచాపూర్ గ్రామంలో సింగిల్ విండోను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కాచాపూర్ సింగిల్‌విండో పర్సన్ ఇన్‌చార్జీగా గ్రామానికి చెందిన డీసీసీబీ మాజీ డైరెక్టర్ లింగాల కిష్టాగౌడ్, బస్వాపూర్ సింగిల్ విండో పర్సన్ ఇన్‌చార్జీగా ర్యాగట్లపల్లికి చెందిన నాగన్నగారి మల్లారెడ్డిని నియమించారు. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ కిష్టాగౌడ్‌కు ఆదివారం నియామక ఉత్తర్వులను అందజేశారు.



ముప్కాల్ శోభాయాత్రలో నృత్యం చేస్తున్న భక్తులు

కనుల పండువగా శోభాయాత్ర

జిల్లావ్యాప్తంగా దుర్గమ్మ నిమజ్జన శోభాయాత్ర ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు పూజలు అందుకున్న అమ్మవారిని ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. శోభాయాత్రలో భవాని మాలధారులు భజనలు, నృత్యాలతో హోరెత్తించారు.



ఘనంగా దసరా

జిల్లావ్యాప్తంగా శనివారం దసరా పండుగను ఘనంగా జరుపుకున్నారు. శమీ చెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం పలు ప్రాంతాల్లో రావణ దహనం నిర్వహించారు.


బోధన్ శక్కర్‌నగర్‌లోని రామ్‌లీలా మైదానంలో రావణ దహనం

పరిశీలన లేకుండానే..

నిశిత కాలేజీకి స్వయంప్రతిపత్తి

- ప్రమాణాలు తీసికట్టుగా ఉన్నప్పటికీ 'న్యాక్ ఏ గ్రేడ్'
- క్రీడా మైదానం, పార్కింగ్ సైతం లేని వైనం
- కింద కమర్షియల్, పైన గదుల్లో కళాశాల
- అన్ని సౌకర్యాలున్న గిరిరాజ్ కళాశాలకు మాత్రం న్యాక్ 'బి' గ్రేడ్ గుర్తింపు





సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: అటానమస్, న్యాక్ గ్రేడ్ గుర్తింపు ఉన్న కాలేజీలకు ప్రాధాన్యత ఉంటుంది. ఇలాంటి కళాశాలలు అరుదుగా ఉండడంతో అందులో చేరడానికి విద్యార్థులు ఆసక్తి చూపుతారు. అయితే అటానమస్, న్యాక్ గ్రేడ్ హోదాలకు సైతం కనీస విలువ లేకుండా కొందరు చేస్తున్నారు. మైదానం, పెద్ద తరగతి గదులు, ప్రమాణాలతో కూడిన ల్యాబ్‌లు ఉన్నా గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలకు న్యాక్ 'బి' గ్రేడ్ ఇచ్చి.. కనీస సౌకర్యాలు లేని నిశిత డిగ్రీ కళాశాలకు మాత్రం న్యాక్ 'ఏ' గ్రేడ్, అటానమస్ హోదా ఇవ్వడంపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. నిశిత కళాశాల భవనం కిందిభాగం కమర్షియల్ దుకాణాలతో ఉంది.

■ నిశిత కళాశాలలో దాదాపు 1,200 మంది విద్యార్థులు, 20 సెక్షన్లు ఉన్నాయి. బీఎస్సీ డేటా సైన్స్‌లో 7 సెక్షన్లు, బీకాం కంప్యూటర్ సైన్స్‌లో 4 సెక్షన్లు. బీఎస్సీ ఆనర్స్ కంప్యూటర్ సైన్స్‌లో 3 సెక్షన్లు. బీబీఏ కోర్సులో రెండు సెక్షన్లు. మిగిలిన కోర్సులకు ఒక్కో సెక్షన్ చొప్పున ఉన్నాయి. వీటన్నింటికీ సరిపడా గదులు లేవు.

■ ఈ కళాశాలలో పది ల్యాబ్‌లు అవసరం. కానీ మూడు ల్యాబ్‌లు కూడా లేవు. 30 తరగతి గదులు అవసరం ఉండగా 25 మాత్రమే ఉన్నాయి. ఎంఎస్సీ మ్యాథ్స్, ఎంఎస్సీ స్టాటిస్టిక్స్, ఎంకాం కోర్సులు నడుస్తున్నాయి. ఈ కోర్సులు ఎక్కడ నిర్వహిస్తున్నారనేది అర్థం కాని పరిస్థితి. డిగ్రీ, పీజీ కోర్సులకు ఒకే లైబ్రరీ ఉంది. పార్కింగ్ స్థలం కూడా లేదు. ఆయా కోర్సులకు సరిపడా అధ్యాపకులు సైతం లేరు. ల్యాబ్‌లకు సైతం తరగతులు బోధించే అధ్యాపకులతోనే సర్దుబాటు చేస్తున్నారు. పీహెచ్‌డీ ఉన్నవారు కనీసం కోర్సుకు ఒక్కరు కూడా లేరు. ఇక అటానమస్ పేరు చెప్పి విద్యార్థుల వద్ద అధిక ఫీజులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. పరీక్ష ఫీజుల కోసం విద్యార్థులను ఫెయిల్ చేసిన సందర్భాలు సైతం ఉండడం గమనార్హం.

■ న్యాక్ 'ఏ' గ్రేడ్ రావాలన్నా, అటానమస్ హోదా పొందాలన్నా కళాశాలల్లో ఐక్యూఏసీ (ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెల్) డైరెక్టర్‌కు కనీసం పీహెచ్‌డీ అర్హత ఉండాలి. కానీ ఇక్కడ డైరెక్టర్‌కు అర్హత లేదు. ప్రతి విద్యా సంవత్సరం కళాశాల పనితీరుపైనా, ఆయా అధ్యాపకుల పరిశోధనలు, పరిశోధనాత్మక ప్రచురణల విషయమై ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి. బోధన సిబ్బంది అర్హత, అనుభవం, పరిశోధన అంశాలతో పాటు అన్ని వివరాలను వెబ్‌సైట్‌లో నమోదు చేయాలి. కానీ ఈ కాలేజీకి సంబంధించిన కనీస సమాచారం దొరకడం లేదు. ఎప్పటికప్పుడు కళా శాల నాణ్యత ప్రమాణాల అంశాన్ని, ఆ కళాశాల వెబ్‌సైట్‌లో ఉంచడంతో పాటు యూజీసీకి నివేదిక అందించాలి. ఈ నివేదిక లో తప్పుడు సమాచారం ఉన్నా, కళాశాల నిబంధనలను ఉల్లంఘించినట్లు తె లిసినా సదరు కళాశాల స్వయం ప్రతిపత్తి హోదాను రద్దు చేసే అధికారం యూజీసీకి ఉంటుంది.

అటానమస్ ఇవ్వాలంటే ఉండాల్సిన సౌకర్యాలు

ఒక కాలేజీకి అటానమస్ హోదా ఇవ్వాలంటే విశాలమైన లైబ్రరీ, క్రీడా మైదానం ఉండాలి. పదేళ్లుగా ఆ కళాశాల మంచి ట్రాక్ రికార్డు కలిగి ఉండాలి. విద్యార్థుల హాజరు, పరీక్ష ఫలితాలు, అధ్యాపకుల అర్హత, అనుభవం, పరిశోధనల ప్రతిపాదనలు ఉండాలి. ముఖ్యంగా ప్రశాంతమైన వాతావరణం ఉండాలి. అంటే ప్రధాన రహదారికి ఆనుకుని ఉండకుండా చూసుకోవాలి. సొంత భవనం, ల్యాబ్‌లు, వివిధ కోర్సులకు లైసెన్స్‌డ్ సాఫ్ట్‌వేర్‌లు ఉండాలి. విద్యార్థులు, సిబ్బందికి సరిపడా పార్కింగ్ సౌకర్యం ఉండాలి. కళాశాల విజ్ఞప్తి మేరకు ఆ యూనివర్సిటీ ఇన్‌స్పెక్షన్ కమిటీ, రిజిస్ట్రార్, అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్, జాయింట్ డైరెక్టర్ తనిఖీలు చేసి అన్నీ నిబంధనల మేరకు సంతృప్తికరంగా ఉన్నట్లయితే యూజీసీకి రికమండ్ చేస్తారు. అయితే ఇవేమి లేకుండానే నిశిత కాలేజీకి అటానమస్ హోదా ఇవ్వడం గమనార్హం. అప్పటి రిజిస్ట్రార్ ఏకపక్షంగా యూజీసీకి రికమండ్ చేసినట్లు, దీని వెనుక పెద్దఎత్తున ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు ఆరోపణలున్నాయి. పర్మినెంట్ అఫిలియేషన్ కోసం 2021 సెప్టెంబర్ 16న నిశిత కాలేజి ప్రిన్సిపాల్ లేఖ రాస్తే సెప్టెంబర్ 25న పర్మినెంట్ అఫిలియేషన్ ఇవ్వడం గమనార్హం. అప్పటి వీసీ, రిజిస్ట్రార్ ఇలా చేయడంపై అనేక విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

నేటి నుంచి కాలేజీల బంద్

- నిరవధిక బంద్ పాటించనున్న ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలలు
- మూడేళ్ల ఫీజు బకాయిలు చెల్లించాలని డిమాండ్



తెయూ ఆడిట్ సెల్ డైరెక్టర్‌కు లేఖ అందిస్తున్న అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు (ఫైల్)

తెయూ(డిచ్‌పల్లి): తమకు రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించే వరకు కాలేజీలు బంద్ పెడతామని ప్రైవేట్ డిగ్రీ, పీజీ కాలేజీల యా జమాన్యాలు నిర్ణయించాయి. మూడేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో ఫీజులు వసూలు చేసే అవకాశం లేక, సర్కార్ నుంచి నిధులు రాక నిర్వహణ కష్టమై దసరా పండుగ తర్వాత నిరవధిక బంద్ పాటించాలని కాలేజీలు నిర్ణయించాయి. రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల ఉన్నతాధికారులకు ఈ మేరకు బంద్ నిర్ణయంపై ఆయా వర్సిటీల పరిధిలోని ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాల సంఘం నాయకులు బంద్ నిర్ణయంపై లేఖలు అందజేశారు. ఈ మేరకు ఈ నెల 9న తెలంగాణ వర్సిటీ రిజిస్ట్రార్, ఆడిట్ సెల్ డైరెక్టర్‌లను కలిసి బంద్ లేఖ అందజేశారు.

కష్టంగా మారిన నిర్వహణ

ఫీజు రీయింబర్స్‌మెంట్‌పైనే ఆధారపడి ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు పాఠాలు చెబుతున్నాయి. బోధనకు అయ్యే ఖర్చులన్నీ యా జమాన్యాలు భరిస్తున్నాయి. మూడేళ్లుగా ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోవడంతో యాజమాన్యాలకు సిబ్బంది జీతాల చెల్లింపు, కాలేజీల నిర్వాహణ భారంగా మారింది. నెలల తరబడి వేతనాలు అందక ఆయా కళాశాలల్లో పని చేస్తున్న అధ్యాపకులు ఇబ్బందులు పడుతున్నారు.

ఎన్నిసార్లు విన్నవించినా

రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్య సంఘం ఆధ్వర్యంలో శాంతి దీక్షలు నిర్వహించినా ఫలితం లేకుండా పోయింది. హైదరాబాద్ ఇందిరా పార్కు దగ్గర వేలాది మంది విద్యార్థులతో నిరసనలు, దీక్షలు చేపట్టినా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాలేదు. ఇటీవల బీసీ సంఘం ఆధ్వర్యంలో ఆర్ కృష్ణయ్య నేతృత్వంలో సైతం భారీ నిరసన చేపట్టారు. రాష్ట్ర మంత్రులు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు, ఎమ్మెల్సీలను కలిసి గోడు వెల్లబోసుకున్నా ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో కాలేజీల యాజమాన్యాలు నిరవధిక బంద్ పాటించాలని నిర్ణయించాయి. దసరా సెలవుల తర్వాత సోమవారం (14) నుంచి అన్ని ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలలు నిరవధికంగా బంద్ పాటించనున్నాయి.

ప్రభుత్వం స్పందించాలి

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల అయ్యే వరకు తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని అన్ని ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలలు నిరవధిక బంద్ పాటించాలని నిర్ణయించాం. ఆరు నెలలుగా సా గిస్తున్న శాంతియుత నిరసనలతో ప్రయోజనం లేకుండా పోయింది. ప్రభుత్వం స్పందించి బకాయి లు విడుదల చేయాలి.

– హరిప్రసాద్, ప్రైవేట్ డిగ్రీ కాలేజీ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చూడాలి

ఫీజు బకాయిల కోసం ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలలు బంద్ పాటిస్తే విద్యార్థులు ఇబ్బంది పడతారు. అకడమిక్ వాతావరణం దెబ్బతినే అవకాశం ఉంది. సెమిస్టర్ పరీక్షలకు ఇబ్బందులు కలుగుతాయి. ఫీజు బకాయిల విషయంలో ప్రభుత్వంతో చర్చించి, సామరస్యంగా పరిష్కరించుకోవాలి.

– ఘంటా చంద్రశేఖర్, అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్

నందివాడలో విషాదఛాయలు



రోదిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు

- ఇద్దరు పిల్లలను బావిలో తోసేసి తండ్రి ఆత్మహత్య

తాడ్వాయి: 'డబ్బులు ఇవ్వకపోతే ఇద్దరు పిల్లలను లేకుండా చేసి నీకు మనశ్శాంతి లేకుండా చేస్తా..' అని బెదిరించిన ఆ కసాయి అన్నంత పని చేశాడు. భార్య, అత్తింటి వారిపై కోపం పెంచుకుని కన్న బిడ్డలను బావిలో తోసేసి తనూ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనతో మండలంలోని నందివాడలో విషాదఛాయలు అలుముకున్నాయి. శనివారం దసరా సందర్భంగా గ్రామానికి చెందిన శ్రీనివాస్‌రెడ్డి(30) తన ఇద్దరు కొడుకులు విఘ్నేశ్(6), అనిరుధ్‌రెడ్డి(4)కి కొత్త డ్రెస్‌లు వేయించి తన బైక్‌పై శమీ పూజకు తీసుకెళ్లాడు. అతడి భార్య అపర్ణ ఇంటి వద్దే ఉన్నది. రాత్రయినా వారు తిరిగిరాకపోయేసరికి కుటుంబ సభ్యులు, గ్రా మస్తులు చుట్టుపక్కల వెతికారు. ఆదివారం ఉదయం గ్రామ శివారులోని ఓ వ్యవసాయ బావి వద్ద శ్రీనివాస్ రెడ్డి ఫోన్, చెప్పులు కనిపించడంతో గ్రామస్తులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. బావిలో నుంచి ఇద్దరు చిన్నారుల మృతదేహాలను బయటికి తీయించారు. మోటార్లు వేసి నీటిని ఖాళీ చేయడంతో బావిలో శ్రీనివాస్ రెడ్డి మృతదేహం లభించింది. తండ్రీకొడుకుల మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. తన కొడుకులు, భర్త మృతదేహాన్ని చూసి అపర్ణ రోదన మిన్నంటింది. తన బిడ్డల మృతదేహాలను గుండెలకు హత్తుకుని ఆమె రోదించడం అక్కడి వారిని కంటతడిపెట్టించింది. శరన్నవరాత్రుల సందర్భంగా చిన్నారులు విఘ్నేశ్, అనిరుధ్ రెడ్డి ప్రతి రోజూ అమ్మవా రి మండపానికి వచ్చి పూజల్లో పాల్గొన్నారని గ్రామస్తులు రోది స్తూ తెలిపారు. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా నాయ్‌గావ్‌కు చెందిన శ్రీనివాస్‌రెడ్డి పదేళ్ల క్రితం ఇల్ల రికం వచ్చాడు. మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ గ్రామానికి చేరుకొని బాధిత కుటుంబాన్ని ఓదార్చారు.



విఘ్నేశ్, అనిరుధ్‌రెడ్డి (ఫైల్)

సహకారంలో సంక్షోభం

■ ఏర్గట్ల మండలం తాళ్లరాంపూర్ సహకార సంఘంలో ప్రతి ఎరువు బస్తాపై రూ.10 ధర పెంచి విక్రయించాలని మహాజన సభలో తీర్మానం చేశారు. ఆరు నెలలుగా సంఘం పరిధిలో పని చేస్తున్న ఏడుగురు సిబ్బందికి వేతనాల బకాయిలు చెల్లించాల్సి ఉండటంతో మహాజన సభలో సభ్యులు అందరు కలిసి ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. మోర్తాడ్ సహకార సంఘం పరిధిలో పని చేస్తున్న ఉద్యోగులకు పది నెలలుగా వేతనాలు చెల్లించడం లేదు. ఈ సంఘంలోను ఆర్థిక లావాదేవీలు కొనసాగుతున్నా వచ్చిన ఆదాయం అప్పులు, నిర్వహణ ఖర్చులకే సరిపోతోంది.

- అప్పుల ఊబిలో కూరుకుపోయిన సొసైటీలు
- ఉద్యోగులకు నెలల తరబడి వేతనాలు ఇవ్వలేని దుస్థితి
- ఉమ్మడి జిల్లాలో 50 శాతం సంఘాల్లో నిధులకు తీవ్ర కొరత
- వ్యాపారాలు చేస్తున్నా లాభాలు రాకపోవడంతో ఆర్థిక భారం



మోర్తాడ్(బాల్కొండ): ఉమ్మడి జిల్లాలోని సహకార సంఘాలు నిధుల కొరతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. అనుకున్నంత ఆదాయం లేకపోవడంతో కనీసం ఉద్యోగులకు జీతాలు చెల్లించని పరిస్థితి నెలకొంది. గతంలో ప్రభుత్వం జారీ చేసిన జీవో 44 ప్రకారం సహకార బ్యాంకు ద్వారా నష్టాలలో ఉన్న సంఘాలకు మూడేళ్ల పాటు వేతనాల కోసం ఆర్థిక సాయం అందించాల్సి ఉంది. వడ్డీ లేని రుణంను సహకార బ్యాంకు ఇస్తే సంఘం ఉద్యోగులకు వేతనాలు చెల్లించి వచ్చిన ఆదాయంతో అప్పులు తీర్చుతారు. ప్రస్తుతం సహకార బ్యాంకుల పరిస్థితి కూడా అంతంత మాత్రంగానే ఉండటంతో సంఘాల ఉద్యోగుల వేతనాల కోసం అప్పు ఇచ్చే పరిస్థితి లేదు. ఉమ్మడి జిల్లా సహకార బ్యాంకు పరిధిలో 146 సొసైటీలు ఉండగా 73 సంఘాల్లో ఉద్యోగులకు నెలల తరబడి వేతనాల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. కార్యదర్శి, సేల్స్‌మెన్, అకౌంటెంట్, అటెండర్ ఇతర ఉద్యోగులకు ఆరు నెలల నుంచి పది నెలల బకాయిల వేతనాలు చెల్లించాల్సి ఉంది. సహకార బ్యాంకు నుంచి రుణాలు ఇచ్చి వేతనాలు చెల్లించే ఏర్పాట్లు చేసుకోవడానికి ప్రత్యేక ఉత్తర్వులను జారీ చేసినా ఎలాంటి ప్రయోజనం లేదు. సహకార సంఘా ల్లో కొనుగోలు కేంద్రాల నిర్వహణ, ఎరువుల దందా కొనసాగుతున్నా ఆశించిన లాభాలు లేకపోవడం, అప్పులకు వడ్డీ భారం పెరగడంతో ఆర్థికంగా ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి.

చక్కదిద్దే ప్రయత్నం చేస్తున్నాం

ఆర్థికంగా నష్టాల్లో ఉన్న సహకార సంఘాల్లో పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేస్తున్నాం. సంఘాల్లో వ్యాపారాలు వృద్ధి చెందితే లాభాల్లోకి వస్తాయి. దీంతో వేతనాలకు ఎలాంటి సమస్య ఉండదు. సంఘాల పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. – శ్రీనివాస్‌రావు, జిల్లా సహకార అధికారి

నామమాత్రంగా ఆడిట్

బాల్కొండ నియోజకవర్గంలో 16 సహకార సంఘాలు ఉంటే మూడు సంఘాల్లోనే వేతనాలు క్రమం తప్పకుండా చెల్లిస్తున్నారు. కామారెడ్డి జిల్లాలో అన్ని సంఘాల ఆర్థిక పరిస్థితి చక్కబడకపోవడంతో వేతనాలు చెల్లించలేని పరిస్థితి ఉంది. గత పాలకవర్గాలు మితి మీరి ఖర్చులు చేశాయనే ఆరోపణలు ఉన్నాయి. సంఘాల ఆడిటింగ్‌ను నామ మాత్రంగానే నిర్వహించడంతో లోపాలు ఉన్నా ఆడిటర్లు మౌనం వహించడంతో ఇప్పటి పాలకవర్గాలకు ఊపిరి సల్పని పరిస్థితి ఏర్పడిందనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది. గతంలో జిల్లా సహకార అధికారిగా పని చేసిన వ్యక్తికి సహకార సంఘాల్లోని అవినీతి అక్రమాలపై ఫిర్యాదులు అందినా ఆయన పట్టించుకోక పోవడం సంఘాల నష్టాలకు ప్రధాన కారణం అని తెలుస్తుంది.

క్లుప్తంగా

'పోచారం తన వ్యాఖ్యలకు కట్టుబడి ఉండాలి'



బాన్సువాడ: తనను బాన్సువాడ నియోజకవర్గానికి వెళ్లొద్దని కాంగ్రెస్‌ అధిష్టానం చెప్పినట్లు ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి వర్నిలో మాట్లాడారని, పోచారం పూర్తిగా అబద్ధాలు మాట్లాడుతున్నారని మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం బాన్సువాడలో కాంగ్రెస్‌ క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడారు. నీవు చెప్పింది నిజమే అయితే తడి బట్టలతో తిమ్మాపూర్‌ వెంకటేశ్వర స్వామి ఆలయానికి వెళ్దామా అని పోచారం శ్రీనివాస్‌రెడ్డికి సవాల్‌ విసిరారు. పోచారం తన మాటలకు కట్టుబడి ఉండాలని, ఎప్పుడు రావాలో డేట్‌ ఫిక్స్‌ చేయాలని కోరారు. తాను నస్రుల్లాబాద్‌ ఎక్స్‌ రోడ్డు వద్ద స్థలం కూడా కొన్నానని, త్వరలో ఇంటి నిర్మాణ పనులు కూడా ప్రారంభిస్తానని అన్నారు. బాన్సువాడలోనే ఉంటానని అన్నారు. నాయకులు మంత్రి గణేష్‌, యలమంచిలి శ్రీనివాస్‌, కమలాకర్‌ రెడ్డి, దివిటి శ్రీనివాస్‌యాదవ్‌, కొత్తకొండ భాస్కర్‌, పాత బాలకృష్ణ, హన్మాండ్లు, గాదం సత్యనారాయణ తదితరులున్నారు.

వంద పడకల ఆస్పత్రి పనులను ప్రారంభించండి



దోమకొండ: మండల కేంద్రంలో 100 పడకల ఆస్పత్రి కోసం ఆర్థిక శాఖ ఆమోదం లభించినందున పనులను ప్రారంభించాలని ఆదివారం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీని కోరి వినతిపత్రం అందించినట్లు మాజీ జెడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్‌ తెలిపారు. పరిపాలనా ఉత్తర్వులు మంజూరు చేయించి పనులు ప్రారంభమయ్యేలా చూడాలని కోరారు. దీని కోసం గ్రామ పంచాయతీ వారు గతంలో ఐదు ఎకరాల భూమిని కేటాయిస్తూ తీర్మానం ఇచ్చినట్లు గుర్తు చేశారు. త్వరలోనే భూమిపూజ చేయించి పనులు ప్రారంభమయ్యేలా చూస్తానని షబ్బీర్‌అలీ హామీ ఇచ్చినట్లు తెలిపారు. కాంగ్రెస్‌ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు శంకర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు సీతారం మధు, నాయకులు రాజేందర్‌ ఉన్నారు.

బెల్ట్‌ షాపులకు టెండర్లు..!

- వీడీసీల ఆధ్వర్యంలోనే నిర్వహణ
- పట్టించుకోని అధికారులు



బాల్కొండ: పల్లెల్లో బెల్ట్‌ షాపుల నిర్వహణకు వీడీసీలే ముహూర్తాలను ఖరారు చేస్తూ టెండర్లు నిర్వహిస్తున్నాయి. ప్రస్తుతం దసరా నుంచి కొత్త బెల్ట్‌ షాపుల నిర్వహణకు గ్రామాల్లో టెండర్ల ప్రక్రియ ప్రారంభమైంది. ముప్కాల్‌ మండలంలోని ఓ గ్రామంలో నెలకు రూ. 12 వేలు వీడీసీకి ఇచ్చేలా టెండర్‌ను రెండు రోజుల క్రితం నిర్వహించారు. ఇలా లైసెన్స్‌ షాపు లేని అన్ని గ్రామాల్లో టెండర్లు నిర్వహించేందుకు వీడీసీలు సిద్ధమవుతున్నాయి. గతేడాది దసరా సీజన్‌లో అసెంబ్లీ ఎన్నికలు ఉండటంతో ఎన్నికల అధికారులు ఆదేశాల మేరకు బెల్ట్‌ షాపులు మూతపడ్డాయి. దీంతో ఏడాదంత బెల్ట్‌ షాప్‌ల నిర్వహణ జరగలేదు. మళ్లీ ఈ దసరా పండుగ నుంచి కొత్త షాపుల నిర్వహణకు టెండర్లు సాగుతున్నాయి. కొన్ని గ్రామాల్లో నెలల వారిగా, మరికొన్ని గ్రామాల్లో ఏడాదిగా టెండర్లు వేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో రూ. లక్షల్లో కూడా టెండర్లు కొనసాగుతోంది. మెండోరా మండలం వెలక్టూర్‌లో గతంలో నెలకు రూ. 60 వేలు చెల్లించేలా టెండర్‌ పాడారు. ఇలా చెప్పుకుంటు పోతే అనేక గ్రామాల్లో పెద్ద మొత్తంలోనే టెండర్లు వేస్తున్నారు. పల్లెల్లో బెల్ట్‌షాపుల నిర్వహణ గ్రామ కమిటీల ఆధ్వర్యంలోనే కొనసాగుతోంది. టెండర్‌ ప్రక్రియ ద్వారా వచ్చే ఆదాయం గ్రామాలకు ప్రధాన ఆదాయంగా మారుతోంది. గ్రామాల్లో చేపట్టే పలు కార్యక్రమాలకు వీటి ద్వారా వచ్చే ఆదాయం ఉపయోగపడుతోంది. పోలీసులు, ఎక్సైజ్‌ అధికారులు పట్టుకుంటే వీడీసీకి సంబంధం లేకుండా ముందే ఒప్పందం చేసుకుంటున్నారు. అంటే పరోక్షంగా వాళ్లకు కావాల్సింది నిర్వాహకులే ముట్టజెప్పాలని తెలుపుతున్నారు. ఇలా పల్లెల్లో ఉదయం 4 నుంచే మద్యం విక్రయించే దుకాణాలకు టెండర్లు నడుస్తున్నాయి. పోలీస్‌, ఎక్సైజ్‌ అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. గత సోమవారం మోర్తాడ్‌ మండల కేంద్రంలో ఎక్సైజ్‌ శాఖ ప్రారంభానికి వచ్చిన మంత్రి జూపల్లి కృష్ణారావు బెల్ట్‌ షాపులపై ఉక్కుపాదం మోపుతామన్నారు. కానీ అదే మండలంలోని గ్రామాల్లో టెండర్లు కొనసాగుతున్నాయి. టెండర్ల విషయమై 'సాక్షి' సంబంధిత ఎక్సైజ్‌ అధికారులను వివరణ కోరేందుకు ఫోన్‌లో సంప్రదించగా వారు స్పందించలేదు.

అ'పూర్వ' సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న నిజామాబాద్‌ వివేకానంద విద్యాలయం పూర్వ విద్యార్థులు



గడ్కోల్‌లో పాల్గొన్న పూర్వ విద్యార్థులు



పెద్దకొడప్‌గల్‌లో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

నిజామాబాద్‌నాగారం/ సిరికొండ: జిల్లా కేంద్రంలోని వివేకానంద విద్యాలయం 1998–99కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం నిఖిల్‌ సాయి హోటల్‌లో అపూర్వ సమ్మేళనం చేపట్టారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అందరూ ఒకే చోట చేరడంతో సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం నాటి గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అర్చన, జానకి, సంతోష్‌, ఫణీంద్ర, రవి, దేవేందర్‌, రమేశ్‌, ప్రశాంత్‌, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. సిరికొండ మండలంలోని గడ్కోల్‌ జెడ్పీహెచ్‌ఎస్‌లో 1996–97కు చెందిన పదోతరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. గడ్కోల్‌, కొండాపూర్‌, తూంపల్లి, తాళ్లరామడుగు గ్రామాలకు చెందిన పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలుకరించుకొని నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు.

పెద్దకొడప్‌గల్‌లో..

పెద్దకొడప్‌గల్‌: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2000 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు శనివారం అపూర్వ సమ్మేళనం చేపట్టారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. దసరా రోజున అందరూ ఒకే చోట కలవడంపై సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం సహపంక్తి భోజనం చేశారు.

ప్రభుత్వ పాఠశాలలో కిటికీల ధ్వంసం



దుండగులు ధ్వంసం చేసిన పీవోపీ

భిక్కనూరు: మండలంలోని బస్వాపూర్‌ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో దుండగులు ఆదివారం వేకువజామున చొరబడి విధ్వంసం సృష్టించారు. వివరాలిలా ఉన్నాయి. నాటి ప్రభుత్వ విప్‌ గంప గోవర్ధన్‌ తన స్వగ్రామమైన బస్వాపూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల కోసం అత్యాధునిక మెస్‌ను నిర్మింపజేశాడు. దుండగులు వేకువజామున పాఠశాలలోకి ప్రవేశించి మెస్‌ గది తాళం పగులగొట్టి లోపలికి చొరబడ్డారు. మెస్‌ హాల్‌లోని పీవోపీని కిటికీల అద్దాలను ధ్వంసం చేయడంతో పాటు కొన్ని విద్యుత్‌ బల్బులను ధ్వంసం చేసి మరి కొన్నింటిని దొంగిలించారు. ఉదయం విషయం గమనించిన స్థానికులు జీపీ సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే కారోబార్‌ అంజయ్య పాఠశాలకు వెళ్లి పరిశీలించి భిక్కనూరు పోలీసులకు పిర్యాదు చేశారు.

ఎల్లలు దాటిన తెలంగాణ సంస్కృతి

- గల్ఫ్‌ దేశాల్లో బతుకమ్మ సంబురాలు నిర్వహించిన తెలంగాణ వాసులు



మోర్తాడ్‌: తెలంగాణ సంస్కృతికి అద్దం పడుతున్న బతుకమ్మ సంబురాలను గల్ఫ్‌ గడ్డపై తెలంగాణవాసులు ఎంతో సంబురంగా నిర్వహించారు. ఒమాన్‌ రాజధాని మస్కట్‌లో ఇండియన్‌ సోషల్‌ క్లబ్‌ కన్వీనర్‌ గుండేటి గణేశ్‌, కో కన్వీనర్‌ నూనె లక్ష్మణ్‌ ఆధ్వర్యంలో శుక్రవారం సద్దుల బతుకమ్మ సంబురాలు చేపట్టారు. ఖతర్‌లో తెలంగాణ ప్రజాసమితి ఆధ్వర్యంలో బతుకమ్మ పండుగను సాంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. దుబాయి, బహ్రెయిన్‌, కువైట్‌, సౌదీ అరేబియా దేశాల్లో తెలంగాణ వాసులు ఇక్కడి మాదిరిగానే బతుకమ్మలను పూలతో పేర్చి పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. అందుబాటులో ఉన్న జలాల్లో బతుకమ్మలను నిమజ్జనం చేసినట్లు వారు తెలిపారు.

పూర్వ విద్యార్థుల అలయ్‌..బలయ్‌



మాణిక్‌భవన్‌ పూర్వ విద్యార్థులు

నిజామాబాద్‌నాగారం: నగరంలోని మాణిక్‌ భవన్‌ పాఠశాలలో 1989కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం దసరా అలయ్‌..బలయ్‌ కార్యక్రమం నిర్వహించారు. తాము చదివిన పాఠశాలలో కలియతిరుగుతూ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకొని దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. యువమిత్ర యువజన సంఘం అధ్యక్ష, కార్యదర్శులు యంసాని రవీందర్‌, చింతల గంగాదాస్‌, కోశాధికారి మల్లెపూల వెంకటేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

అమెరికాలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



జార్జియా అట్లాంటాలో గ్రంథాలు విక్రయిస్తున్న బోధన్‌ వాసులు

బోధన్‌: దసరా పండుగను పురస్కరించుకుని అమెరికా దేశంలోని జార్జియా అట్లాంటా నగర కేంద్రంలో బోధన్‌కు చెందిన త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూరు జ్ఞాన సమితి సభ్యులు దైవ జ్ఞాన ప్రచారంలో భాగంగా మూడో రోజు ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీత, ఇతర ఆధ్యాత్మిక గ్రంథాల పరిచయం, ప్రచార కార్యక్రమాన్ని చేపట్టారు. ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన త్రైత సిద్ధాంత గ్రంథాలతో బుక్‌ స్టాల్‌ను ఏర్పాటు చేశారు. దసర పండుగ విశిష్టతను ప్రబోధానంద యోగీశ్వరులు గ్రంథాల్లో పేర్కొన్నారని తెలిపారు. సేవా సమితి సభ్యులు ఆవుల వెంకటరమణ, వనజ, నాగలలిత, నాగ రుద్ర పాల్గొన్నారు.

భవాని దీక్షాపరుల ఆందోళన



పీఎస్‌ ఎదుట ఆందోళన చేస్తున్న దీక్షాపరులు

బాన్సువాడ: భవానీమాత దీక్షాపరులు ఆదివారం బాన్సువాడ పీఎస్‌ ఎదుట ఆందోళన చేపట్టారు. కొయ్యగుట్ట వద్ద జక్కల్‌దాని తండాకు చెందిన యువకులు మద్యం సేవించి రోడ్డుపై వెళ్తున్న నిజాంసాగర్‌ మండలం గాలిపూర్‌కు చెందిన భవానీమాత స్వాములతో గొడవకు దిగారు. ఓ దీక్షాపరుడి మాలను యువకులు తెంచడంతో స్వాములు, యువకుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఈ విషయం మండలంలోని దీక్షాపరులకు తెలియడంతో పెద్ద ఎత్తున పీఎస్‌కు తరలివచ్చారు. మాలను తెంచిన యువకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్‌ చేశారు. పీఎస్‌ ఎదుట ఆందోళన చేసి రాజీవ్‌చౌరస్తా వద్ద రాస్తారోకో చేపట్టారు. యువకులపై చర్యలు తీసుకుంటామని సీఐ అశోక్‌ హామీ ఇవ్వడంతో దీక్షాపరులు శాంతించి అక్కడి నుంచి వెళ్లిపోయారు.

ఇద్దరిపై కేసు నమోదు

సిరికొండ: మండలంలోని ముషీర్‌నగర్‌లో ఒకరిపై ఒకరు పరస్పరం దాడి చేసుకున్న ఘటనలో ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎల్‌ రామ్‌ ఆదివారం తెలిపారు. వ్యవసాయ భూమి విషయంలో దాడి జరిగింది. ఇరువురి ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

వృద్ధురాలి అదృశ్యం

మాచారెడ్డి: మండల కేంద్రానికి చెందిన మంతపురం లక్ష్మి(70) అనే వృద్ధురాలు అదృశ్యమైనట్లు ఎస్సై అనిల్‌ ఆదివారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన లక్ష్మి ఈ నెల 10న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు పలు చోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. బాధిత కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. ఫొటో ఆధారంగా వృద్ధురాలు ఆచూకీ తెలిసిన వారు పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

క్రైం కార్నర్‌

వినాయక్‌నగర్‌లో చైన్‌ స్నాచింగ్‌

ఖలీల్‌వాడి: నగరంలోని నాలుగో టౌన్‌ పీఎస్‌ పరిధిలోని శ్రీనగర్‌ కాలనీకి చెందిన మహిళ వినాయక్‌నగర్‌ లో నడుచుకుంటూ వెళ్తుండగా మహిళ మెడలో ఉన్న బంగారు గొలుసును గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న ఓ మహిళ వద్దకు ముగ్గురు దుండగులు బైక్‌పై వచ్చి ఆమె మెడలో ఉన్న మూడు తులాల బంగారం పుస్తెలతాడును లాక్కొని పరారయ్యారు. బాధితురాలు నాలుగో టౌన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఈ విషయమై ఎస్సై శ్రీకాంత్‌ను వివరణ కోరేందుకు ఫోన్‌లో సంప్రదించగా ఆయన స్పందించలేదు.

స్వగ్రామానికి చేరిన మృతదేహం



ఇందల్వాయి: వారం రోజుల క్రితం నల్లవెల్లి గ్రామానికి చెందిన ఒడ్డె శంకర్‌(50) బహ్రెయిన్‌ దేశంలో అనారోగ్యంతో అక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించేందుకు ఇండియన్‌ ఎంబసీ ఏర్పాట్లు చేసింది. అందుకు కృషి చేసిన బహ్రెయిన్‌ తెలుగు కళా సమితి కార్యదర్శి నోముల మురళికి ప్రవాస భారతీయుల హక్కుల సంక్షేమ వేదిక అధ్యక్షుడు కోటపాటి నరసింహ నాయుడు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్‌ఆర్‌ఐ సెల్‌ అధికారి చిట్టిబాబు ఎయిర్‌పోర్టు నుంచి మృతదేహాన్ని తరలించేందుకు ఉచిత అంబులెన్స్‌ సౌకర్యం కల్పించినట్లు కోటపాటి తెలిపారు. ఆదివారం సాయంత్రం శంకర్‌ అంత్యక్రియలు నల్లవెల్లిలో నిర్వహించారు.

డివైడర్‌ను ఢీకొన్న బైక్‌.. ఒకరి మృతి



సదాశివనగర్‌: మండల శివారులోని జాతీయ రహదారిపై ఓ బైక్‌ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందినట్లు ఎస్సై రంజిత్‌ ఆదివారం పేర్కొన్నారు. కామారెడ్డిలోని కమ్మరిగల్లీకి చెందిన అంకరాజు అఖిల్‌(23) అడ్లూర్‌ ఎల్లారెడ్డిలో ఉన్న మిత్రుల వద్దకు బైక్‌పై వచ్చాడు. మిత్రులతో కలిసి విందు చేసుకున్నారు. భోజనం చేసేందుకు మండల కేంద్రమైన సదాశివనగర్‌ వైపునకు వస్తుండగా బైక్‌ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్నది. ఈ ఘటనలో అఖిల్‌ తలకు బలమైన గాయం కావడంతో చికిత్స నిమిత్తం కామారెడ్డికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

కుక్కను తప్పించబోయి మరొకరు..

కామారెడ్డి క్రైం: కుక్కను తప్పించబోయి బైక్‌ అదుపుతప్పి పడిపోయిన ఘటనలో ఒకరు మృతి చెందిన ఘటన కామారెడ్డి జాతీయ రహదారిపై శనివారం రాత్రి చోటు చేసుకుంది. దేవునిపల్లి ఎస్సై రాజు ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి మున్సిపల్‌ పరిధిలోని పాతరాజంపేటకు చెందిన సలీం(34) తన కుటుంబంతో కలిసి కొన్నిరోజులుగా పట్టణంలోని వాంబే కాలనీలో నివాసం ఉంటున్నాడు. దసరా పండుగకు స్కూళ్లకు సెలవులు ఉండటంతో కుటుంబంతో కలిసి పాత రాజంపేటకు వెళ్లారు. శనివారం రాత్రి టీ తాగేందుకు పొందుర్తి చౌరస్తాకు వెళ్తుండగా కుక్క అడ్డు రావడంతో తప్పించబోయి బైక్‌ అదుపు తప్పి కిందపడిపోయాడు. తీవ్ర గాయాలైన అతడిని స్థానికులు జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు తెలిపారు. మృతుని భార్య నస్రీన్‌ బేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

బైక్‌ను ఢీకొన్న లారీ.. ముగ్గురికి తీవ్రగాయాలు

ఖలీల్‌వాడి: అతివేగంగా నడుపుతున్న ఓ లారీ కంఠేశ్వర్‌ బైపాస్‌ ప్రాంతంలో బైక్‌ను శనివారం ఢీకొన్నది. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న ముగ్గురిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉండగా మరో ఇద్దరికి తీవ్రగాలయ్యాయి. మూడో టౌన్‌ ఎస్సై మహేశ్‌ ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం.. కాలూర్‌కు చెందిన గణేశ్‌ తన స్నేహితులైన రాయుడి రాజు, మత్తురాజులను తన బైక్‌పై కాలూరు నుంచి దుబ్బకు శనివారం సాయంత్రం వస్తుండగా అదే సమయంలో కంఠేశ్వర్‌ బైపాస్‌ నుంచి అర్సపల్లి వైపు వెళ్తున్న ఓ లారీని అతివేగంగా ఢీకొన్నది. ఈ ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా రాజేశ్‌ పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తరలించారు. గణేశ్‌ తల్లి కస్తూరిబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పండుగ వేళ.. కబళించిన మృత్యువు

- పొలంలో కిందికి వేలాడుతున్న వైర్లు తగిలి యువకుడి మృతి
- చేనుకి వెళ్లొస్తానన్న కొడుకు తిరిగిరాక తల్లడిల్లిన తల్లి
- విద్యుత్‌శాఖ నిర్లక్ష్యమే కారణమంటు గ్రామస్తుల ఆందోళన

దసరా రోజున ఓ కుటుంబంలో విషాదం చోటు చేసుకుంది. పొలానికి వెళ్లిన కుమారుడు విద్యుదాఘాతానికి గురై మృతి చెందడంతో ఆ దృశ్యాన్ని చూసిన తల్లి గుండెలవిసేలా రోదించింది. దసరాకు కొత్త బట్టలు తొడుక్కో కొడుకా అంటే లేదమ్మా చేనుకాడికి పోయొచ్చినంక వస్తనంటివి ఇప్పుడు నేనెట్ల చేద్దు కొడుకా.. నువ్వు లేని ఈ బతుకెందుకు కొడుకా అంటూ ఆ తల్లి చేసిన రోదన అందరినీ కంటతడి పెట్టేలా చేసింది.



రాజేశ్‌ మృతదేహం



రాజేశ్‌ (ఫైల్‌)

మాచారెడ్డి: పొలంలో వేలాడిన విద్యుత్‌ వైర్లు తగిలి ఓ యువకుడు మృతి చెందిన ఘటన పాల్వంచ మండలం బండరామేశ్వర్‌పల్లిలో శనివారం చోటు చేసుకుంది. మాచారెడ్డి ఎస్సై అనిల్‌ ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన శనిగిరి రాజేశ్‌(16) ఇంటర్‌ ఫస్టియర్‌ చదువుతున్నాడు. తల్లితండ్రులకు పొలం పనుల్లో చేదోడువాదోడుగా ఉండేవాడు. శనివారం దసరా ఉండడంతో కొత్త బట్టలు తొడుక్కో కొడుకా అని తల్లి దేవరాణి అంటే లేదమ్మా రోజులాగే పొలం కాడికి పోయిచ్చినంక వేసుకుంటానన్నాడు. సాయంత్రం గ్రామ శివారులోని పొలం వద్దకు వెళ్లాడు. పొలంలో కోతులు ఉంటుండడంతో పొడవాటి కర్రతో ఒడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా కిందికి వేలాడుతున్న 11 కేవీ విద్యుత్‌ వైర్లు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. పొలానికి వెళ్లిన కొడుకు ఇంకా ఎందుకు రావడం లేదంటు తల్లి రాజేశ్‌కు ఫోన్‌ చేసింది. స్పందించక పోవడంతో అనుమానం వచ్చి పొలానికి పరుగులు తీసింది. సమీపంలోని ఓ రైతును తన కొడుకు గురించి అడిగితే పొలానికి వెళ్తుండగా చూసినట్లు చెప్పాడు. తీరా పొలంలో చూడగా చేతిలో కర్రతో రాజేశ్‌ విగతజీవిగా కిందపడి ఉన్నాడు. ఆ దృశ్యాన్ని చూసిన తల్లి గుండెలుపగిలేలా ఏడ్చింది. ఇరుగుపొరుగు రైతులు ఘటన స్థలానికి చేరుకొని పోలీసులకు సమాచారం అందించారు.

పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

విద్యుత్‌ అధికారుల నిర్లక్ష్యమే..

పొలంలో 11 కేవీ విద్యుత్‌ లైన్లు వేలాడుతున్నాయని పలువురు రైతులు విద్యుత్‌ శాఖ అధికారులకు చెప్పినా పట్టించుకోలేదు. అధికారుల నిర్లక్ష్యమే రాజేశ్‌ ప్రాణాలు తీసిందంటు గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఓ దశలో మృతదేహంతో ఆందోళన చేపట్టడానికి సిద్ధమయ్యారు. అక్కడే ఉన్న పోలీసులు సముదాయించి విద్యుత్‌ ఉన్నతాధికారులతో మాట్లాడించారు. స్పందించిన అధికారులు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు శాంతించారు.

బోధన్‌లో కత్తిపోట్ల కలకలం

బోధన్‌టౌన్‌: బోధన్‌ పట్టణంలోని గాంధీనగర్‌ కాలనీలో కత్తిపోట్ల కలకలం రేపింది. పట్టణ సీఐ వెంకటనారాయణ ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం .. పట్టణంలోని గాంధీనగర్‌ కాలనీకి చెందిన షేక్‌ మన్సూర్‌ అదే కాలనీకి చెందిన మహ్మద్‌ అజీమొద్దీన్‌తో ఉన్న పాత గొడవలతో పాటు అతనికి సంబంధించిన వీడియో సోషల్‌ మీడియాలో వైరల్‌ చేస్తున్నాడనే కోపంతో శనివారం గొడవపడ్డాడు. గొడవను ఆపేందుకు వచ్చిన మహ్మద్‌ అజీమొద్దీన్‌ కుమారుడు ఆసీఫ్‌ రిహాన్‌, తమ్ముడు జావిద్‌ గొడవను ఆపేందుకు వెళ్లగా వారిపై మన్సూర్‌ తన వద్ద ఉన్న కత్తితో దాడి చేశాడు. ఈ ఘటనలో వారికి గాయాలయ్యాయి.

సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన ఇద్దరిని పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కత్తితో దాడికి పాల్పడిన మన్సూర్‌ను అదుపులోకి తీసుకొని పీఎస్‌కు తరలించారు. అజీమొద్దీన్‌ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి



సాయమ్మ మృతదేహం

నందిపేట్‌: మండల కేంద్రంలోని రాజనగర్‌ ప్రాంతానికి చెందిన ర్యాపని సాయమ్మ(50) చికిత్స పొందుతూ మృతి చెందింది. ఎస్సై హరిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. సాయమ్మ కొంత కాలంగా మద్యానాకి బానిసైంది. శనివారం పండుగ సందర్భంగా ఇంటికి బంధువులు వచ్చారు. వారి ముందు మద్యం తాగుతుండగా భర్త నర్సయ్య ఆమెను మందలించాడు. దీంతో మనస్తాపంతో బాత్‌రూం కడిగే యాసిడ్‌ తాగింది. వెంటనే చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందింది. మృతుడి పెద్ద కుమారుడు ర్యాపని గణేశ్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

అనుమానాస్పదస్థితిలో ఒకరు..



సంజీవ్‌ కుమార్‌(ఫైల్‌)

నవీపేట: మండల శివారులోని రహదారి పక్కన ఉన్న కాలువలో అనుమానాస్పద స్థితిలో నవీపేటకు చెందిన కొలాస సంజీవ్‌ కుమార్‌(48) మృతి చెందినట్లు నిజామాబాద్‌ నార్త్‌ రూరల్‌ సీఐ సతీశ్‌, ఎస్సై వినయ్‌ ఆదివారం తెలిపారు. శనివారం దసరా పండుగ కావడంతో స్నేహితులతో కలిసి వెళ్లాడు. రాత్రి ఇంటికి చేరుకోలేదు. ఆదివారం ఉదయం కాలువలో మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడి భార్య సుమలత ఫిర్యాదు మేరకు అనుమామాస్పదమృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ, ఎస్సై పేర్కొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

ఖలీల్‌వాడి: నగరంలోని శివాజీనగర్‌ శ్మశాన వాటిక సమీపంలో పేకాట స్థావరంపై పోలీసులు ఆదివారం రాత్రి దాడి చేసినట్లు తెలిసింది. పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసి వారి నుంచి నగదు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. దాడిలో ఎక్కువ మొత్తంలో నగదు లభించినా పోలీసులు తక్కువ మొత్తంలో చూయిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అనారోగ్యంతో ఒకరి ఆత్మహత్య

మోర్తాడ్‌: అనారోగ్య సమస్యలతో ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన మోర్తాడ్‌ మండల కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై విక్రమ్‌ తెలిపిన వివరాల ప్రకారం.. మోర్తాడ్‌ మండల కేంద్రానికి చెందిన నూతికట్టు వెంకటి(60) ఉపాధి కోసం గల్ఫ్‌ దేశాలకు వెళ్లి వచ్చిన అతను స్థానికంగానే ఉంటూ చేపలు పడుతూ జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. దీంతో జీవితంపై విరక్తి చెంది బస్టాండ్‌ సమీపంలోని ఉన్న చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య సుగుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్‌ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

రైలు కింద పడి మరొకరు..



కామారెడ్డి క్రైం: రైలు కిందపడి ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన కామారెడ్డి రైల్వే పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని అక్కన్నపేట సమీపంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. జగిత్యాల జిల్లా మల్లాపూర్‌ మండలం ముత్యంపేటకు చెందిన మారగాని రాజు(35) ఆటో నడుపుతూ జీవనం సాగించేవాడు. ఇటీవల ఆర్థిక ఇబ్బందులు, కుటుంబంలో గొడవలు పెరిగాయి. దీంతో జీవితంపై విరక్తి చెందిన అతడు శనివారం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. రాత్రి 11 గంటల ప్రాంతంలో కుటుంబ సభ్యులకు ఫోన్‌ చేసి తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు చెప్పి ఎదురుగా వస్తున్న ఓ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబీకుల సమాచారం మేరకు కామారెడ్డి రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఏఎస్సై సుధాకర్‌ పేర్కొన్నారు.